క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు అండగా ఉంటాం



నూతన భవన నిర్మాణంపై చర్చిస్తున్న సాయిరాం

పెద్దకడబూరు : దివ్యాంగ విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఐఈడీ జిల్లా కో ఆర్డినేటర్ సాయిరామ్ మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని భవిత సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు అన్ని విధాల అలవెన్స్‌లు అందిస్తామని, మండల కేంద్రంలో వారికోసం నూతన భవన నిర్మాణానికి సహకరిస్తామన్నారు. ప్రతి రోజూ బడికి వచ్చే విధంగా ఐఈఆర్టీలు వారిని ప్రోత్సాహించాలన్నారు. ఐఈ జిల్లా అసిస్టెంట్ కో ఆర్డినేటర్ విజయ్‌ప్రసాద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ లక్ష్మన్న, అకౌంటెంట్ సురేష్‌రెడ్డి, డీటీపీ రామకృష్ణమ్మ, సీఆర్పీలు లక్ష్మన్న, కృష్ణాచారి, ఐఈఆర్టీలు గోపాల్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోనిరూరల్ : అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదోని రైల్వేస్టేషన్ వద్ద సెబ్, రైల్వే పోలీస్‌లతో కలిసి తనిఖీలు చేపట్టగా, పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రాజు మూడు బాక్సుల కర్ణాటక మద్యం రవాణా చేస్తూ పట్టుబడగా, మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సెబ్ ఎస్‌ఐ శివప్రసాద్, రైల్వే ఎస్‌ఐ రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ఆదోనిరూరల్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులవల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కోరారు. మండలంలోని దొడ్డనకేరి, గణేకల్ గ్రామ సచివాలయాల ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాల్లో వర్షాలు లేక పంటలు పూర్తిస్థాయిలో ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టి ఎకరాకు రూ.30 వేలు చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. రైతు సంఘం మండల నాయకులు హనుమంతరెడ్డి, మునిస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోవిందు, ఈరన్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను గౌరవిద్దాం



పెద్దకడబూరులో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్ రామాంజనేయులు

పెద్దకడబూరు : పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సర్పంచ్ రామాంజనేయులు పేర్కొన్నారు.స్థానిక సచివాలయం-1లో శుక్రవారం స్వచ్ఛతా హి సేవా 2023 కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులు, వాటర్ మెన్‌లను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, సర్వేయర్ లలిత, వలంటీర్లు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ మహ్మద్ ఖాద్రీ

మంత్రాలయం : మండలంలోని తుంగభద్ర, మాధవరం గ్రామాల్లో ఫర్టిలైజర్స్ దుకాణాలను వ్యవసాయ శాఖ ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏఓ జీరా గణేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆయా దుకాణాల్లో రికార్డులను, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, రైతులకు అందించిన ఎరువులు, మందుల వివరాలను సేకరించారు. ఈపాస్ మిషన్‌లో నమోదు చేసి రైతులకు విక్రయించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జయప్రదం చేయండి

కోసిగి: జిల్లాలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని మండల కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు, మండల నాయకులు దిలీప్, ప్రకాష్ కోరారు. శుక్రవా రం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి దళిత రక్షణ యాత్ర జయప్రదం చేయాలని అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు న్యాయబద్ధంగా బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. నేడు కోసిగి మీదుగా యాత్ర బయలు దేరుతోందని, దళితులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



నిమజ్జనోత్సవానికి కదులుతున్న విఘ్నేశ్వరుడు



వేలంలో లడ్డును దక్కించుకొని ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం



శోభాయాత్రను తిలకించేందుకు దుకాణాలు, మిద్దెలపై చేరిన జనం



డీజే పాటలకు గణనాథుడి ముందు నృత్యం చేస్తున్న యువకులు

గంగ ఒడికి పార్వతీ సుతుడు

- భక్తజనుల మధ్య కనుల పండువగా సాగిన నిమజ్జనోత్సవం
- ఆలస్యంగా విగ్రహాల ఊరేగింపు

చతురాయనమః హరయే
కృతినే విభుదేశ్వరాయ కేదార సుతః
స్తుతి హర్షితాయ గదినే
గతిదాయ అజాయ జ్ఞాన గమ్యాయ నమః

ఆదోని సాక్షి నెట్‌వర్క్ : వినాయక చవితి సందర్భంగా ఐదు రోజుల పాటు భక్తులతో పూజలందుకున్న వినాయకుడు శుక్రవారం గంగ ఒడి చేరాడు. పట్టణంలో లంబోదరుడి నిమజ్జనోత్సవం కన్నులపండువగా జరిగింది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన నిమజ్జనోత్సవం శనివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగింది. ప్రధాన రహదారిలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో వినాయక ఉత్సవ కమిటీ నేతృత్వంలో కొలువుదీరిన గణపతి విగ్రహానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఉత్సవకమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు.అంతకముందు వినాయకుడి ప్రసాదంగా ఉంచిన లడ్డూ, హుండీకి ఉత్సవకమిటీ పెద్దలు వేలం నిర్వహించారు. లడ్డూను భారత్‌గ్యాస్ యజమాని మల్లికార్జునరెడ్డి రూ.1.10 లక్షలకు కైవసం చేసుకున్నారు. వ్యాపారవేత్త శ్రీకాంత్‌రెడ్డి రూ.90 వేలకు హుండీని దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు బసవన్నగౌడ్, హెగ్గటి ప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, దేవిశెట్టి ప్రకాష్, విట్టారమేష్, ఎండీ బసవరాజు, మారుతరావు, కునిగిరి నీలకంఠ పాల్గొన్నారు.



ఆదోని పట్టణంలో విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న ఉత్సవ సమితి సభ్యులు, నాయకులు

తుంగభద్ర దిగువ కాలువలో..

చిన్నహరివాణం సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయకఘాట్‌లో సంప్రదాయబద్ధంగా సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, జయమనోజ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవానికి అంకురార్పణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలోని ఆయా వీధుల్లో కొలువుదీరిన 500కు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. కాగా శుభ ముహూర్తం కోసం మండప నిర్వాహకులు చాలా మంది సాయంత్రం ఆలస్యంగా ఊరేగింపు ప్రారంభించారు. దీంతో విగ్రహాల ఊరేగింపు పాత బస్టాండు కూడలి చేరుకోవడానికి 8 గంటలు పట్టింది.

దాహార్తి తీర్చిన దాతలు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఫోటో స్టూడియో నిర్వాహకులు, జిల్లా జంగమ సంఘం సభ్యులు దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా పలువురు అల్పాహారం పంపిణీ చేశారు.

భారీ బందోబస్తు

పట్టణం సున్నితాత్మక ప్రాంతం కావడంతో ఉత్సవాలకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో 600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

బందోబస్తును పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ

ఆదోని పట్టణంలో జరుగుతున్న వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు తెలియజేశారు. అనంతరం చిన్నహరివాణం ఎల్లెల్సీ కాలువ వద్దకు చేరుకుని వినాయకుల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.



నృత్యం చేస్తున్న బాలికలు



అల్పాహారం పంపిణీ చేస్తున్న ప్రముఖులు



ఎల్లెల్సీ కాలువ వద్ద పోలీసులకు సూచనలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

బైబై వినాయక..

కోసిగి: మండల కేంద్రంలో కొలువుతీరిన గణనాథులు ఐదవ రోజున శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. వైఎస్సార్ సర్కిల్, శ్రీరామనగర్, సిద్దప్ప పాళెం, ఆంజనేయ స్వామి, కాళికాదేవి, గీతామందిరం, ఎస్టీఆర్ కాలనీలలో కొలువుతీరిన గణనాథులను ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గీతామందిరం దగ్గర కొలువు తీరిన మహావీర్ గణపతి ఊరేగింపులో మహిళలు, యువకులు ఆకర్షణీయంగా ఊరేగింపుగా వెళ్లారు. మధ్యాహ్నం నుంచి మేళతాళాలు, కలశాలతో పురవీధుల్లో ఊరుగింపుగా బయలుదేరి మాధవరం గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

కౌతాళం: మండలంలో ఐదవ రోజు శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం వైభవంగా కొనసాగింది. బదినేహాల్, కుంటనహాల్, ఉప్పరహాల్, వల్లూరు గ్రామాలలో కొలువైన గణేష్ విగ్రహాలను సాయంత్రం నుంచి రాత్రి వరకు యువకుల నృతాలు, మేళతాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనం చేశారు. ఎల్ఎల్‌సీ కాలువ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ ఘాట్ వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేపట్టారు.



విగ్రహ ఊరేగింపులో చిన్నారుల సంబరం



కోసిగిలో ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వెళ్తుతున్న భక్తులు



కుంటనహాల్‌లో యువకుల కేరింతల మధ్య



గణనాథులను చూసేందుకు వచ్చిన భక్తులు

24 నుంచి దక్షిణామూర్తి ఆరాధనోత్సవాలు



దక్షణామూర్తి స్వామి

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో ఈ నెల 24 నుంచి దక్షిణా మూర్తి స్వామి 31వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. 24వ తేదీన ఆలయంలోస్వామివారికి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళ హారతులు తదితర కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీలు

దక్షిణా మూర్తి ఆరాధనోత్సవాల సందర్భంగా ఈనెల 24వ తేదీన రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు చెప్పారు. గెలుపొందిన వారికి 1 నుంచి 12 బహుమతులు వరుసగా రూ.15,116, రూ.12,116, రూ.9,116, రూ.7,116, రూ.6,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116, రూ.2,516, రూ.2,016, రూ.1,616, రూ.1,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 87902 42809, 80745 08537 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

ఆలూరు: గ్రామ పంచాయతీలలో ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పత్తికొండ రెవెన్యూ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్‌నానాయుడు సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలను ఆదేశించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ ఆరోగ్య సురక్ష, తాగునీటి సదుపాయం, మురుగునీటి పారుదల, చెత్త, చెదారం, డంపింగ్ యార్డు, చెత్త నిర్వహణ కేంద్రం తదితర కార్యక్రమాలపై సిబ్బందితో ఆయన శుక్రవారం చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సీజనేల్, అంటురోగాల బారిన పడకుండా ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగు నీరు, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. మురుగు నీటి నిల్వ ఏర్పడకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీకి పెండింగ్‌లో ఉన్న బకాయిలను బిల్‌కలెక్టర్లు వసూలు చేయాలని ఆదేశించారు.

29న వరల్డ్ హార్ట్ డే వేడుకలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో ఈ నెల 29వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. ప్రపంచ హృదయ దినోత్సవ వాల్ పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఫ్‌సీఎస్‌ఐ క్రిస్టియన్ మెడికల్ కాలేజి కార్డియాలజిస్టు డాక్టర్ జార్జ్ జోసఫ్ హాజరై జీవనశైలి మార్పులు, హృదయ సంబంధిత వ్యాధులు విజృంభించేందుకు ఎలా దారి తీస్తాయనే అంశమై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, మాజీ జిల్లా కలెక్టర్ రామశంకర్‌నాయక్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ కల్కూర చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కృష్ణగిరి: ఆంధ్రప్రదేశ్ గట్కా చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 17న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరిగిన అండర్-14, 18 విభాగంలో తమ విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందన్నారు. 9వ తరగతి విద్యార్థినులు మమత, లావణ్య బంగారు పతకాలు, అలాగే హారిక, జాస్మిన్, ఎస్తేర్ రాణి, 10వ తరగతి విద్యార్థిని కల్యాణి వెండి పతకాలు, హరిప్రియ, స్వాతి, ఆనూష, హారిక మంజుల మూడో స్థానంలో నిలిచి కాంసత్య పతకాలు సాధించినట్లు ఆమె తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, పీఈటీ సుప్రియను శుక్రవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ఆదోనిఅర్బన్ : ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామానికి చెందిన షేక్‌మహబూబ్‌బాషా (35) శుక్రవారం పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే బంధువులు గ్రామంలో పసురు వేయించినా తగ్గకపోవడంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. అక్కడి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ప్రతిభతో ఉన్నత స్థానం

ఆదోని సెంట్రల్: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్ నరసయ్య, సహాయ కో ఆర్డినేటర్ రామన్న అన్నారు. శుక్రవారం స్కూల్ గేమ్స్ పోటీల్లో బాలుర జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. అండర్-17 కబడ్డీ పోటీల్లో పెద్దహరివాణం జట్టు, ఎస్ఎంహెచ్ఎస్ ఆదోని జట్టు పోటీ పడగా పెద్దహరివాణం జట్టు విజేతగా నిలిచింది. అండర్-14 విభాగంలో పెద్దహరివాణం పాఠశాల జట్టు విజయం సాధించగా బల్లెకల్లు పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్-17 ఖోఖో పోటీల్లో పెద్దహరివాణం జట్టు విజేతగా, పెద్దతుంబళం జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్-14లో ధణాపురం పాఠశాల జట్టు గెలుపొందగా.. పెద్దహరివాణం జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్-17 త్రోబాల్ పోటీల్లో ఆరెకల్లు జట్టు విజేతగా, విందృశ్రీ పాఠశాల రన్నర్‌గా నిలిచింది. అండర్-14లో సెయింట్ జోసఫ్ పాఠశాల విజయం సాధించగా కిడ్డీస్ పాఠశాల రన్నర్‌గా నిలిచింది. అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఎస్ఎంహెచ్ జట్టు ప్రథమస్థానంలో నిలవగా.. పెద్దతుంబళం జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్-14లో దొడ్డనగేరి జట్టు .. సంతేకూడ్లూరు జట్టుపై గెలుపొందింది. అండర్-17 టెన్నికాయిట్ పోటీల్లో సంతేకూడ్లూరు జట్టు విజయం సాధించగా నేషనల్ పాఠశాల జట్టు రెండో స్థానంతో సరిపెట్టుకుంది. అండర్-14లో సంతేకూడ్లూరు పాఠశాల జట్టు అమరావతి ప్రభుత్వ పాఠశాల జట్టుపై గెలుపొందింది. గెలుపొందిన జట్లకు మొమెంటోలను అందజేశారు.



కబడ్డీ ఆడుతున్న బల్లెకల్లు విద్యార్థులు



కబడ్డీ విజేతగా నిలిచిన పెద్దహరివాణం జట్టు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

– కోసిగిలో నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు

కోసిగి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయి ఎదగాలని స్థానిక బాలుర హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం ఖలీల్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం పాఠశాల క్రీడా మైదానంలో మంత్రాలయం నియోజకవర్గ పీడీ నరసింహులు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో కౌతాళం, మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు మండలాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్-17, 14 బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు.కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, హ్యాండ్ బాల్ పోటీలు ఏర్పాటు చేశారు. నేడు మౌంట్ కార్మెల్ స్కూల్‌లో అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని చెప్పారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టు ఎంపిక పోటీలకు పంపుతామని తెలిపారు.



త్రోబాల్ ఆడుతున్న బాలికలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

చిరుత కలకలం



పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని కొండపై చిరుత

పత్తికొండ రూరల్: పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని కొండ ప్రాంతంలో చిరుత సంచారం శుక్రవారం కలకలం రేపింది. రైతుల నుంచి విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారి రామ్మోహన్ కొండ ప్రాంతంలోని పొలాల వద్ద పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గతంలో కొన్నినెలల క్రిందట ఈ ప్రాంతంలో చిరుత పాద ముద్రలను ఫారెస్టు అధికారులు సేకరించారు. తరువాత కొంతకాలం చిరుత జాడ కనిపించలేదు. తాజాగా చిరుత సంచారంతో రైతులు పొలానికి ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచారంపై నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే ఉన్నతాధికారుల సూచనల మేరకు బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చెప్పారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కోసిగి: మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం వేళ కోసిగి మీదుగా ఆదోని వైపు వైగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడటంతో శరీరం రెండుగా విడిపోయింది. స్థానికులు గుర్తించి కోసిగిలోకి కడపాళెం వీధికి చెందిన మంగళి గోపాల్ (50)గా గుర్తించారు. రైల్వే పోలీసులు సంఘన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

తుగ్గలి: రైతులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ 15వ విడత నగదు త్వరలో జమ కానుందని ఆ లబ్ధి పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరని, ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

లారీ బోల్తా పడి క్లీనర్ దుర్మరణం

పత్తికొండ రూరల్: పత్తికొండ-రాతన రోడ్డులోని మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ప్రకాశం జిల్లా కురిచేడు గ్రామానికి చెందిన బుడ్డబాషా (32) దుర్మరణం చెందగా డ్రైవర్ షేక్ నాగూర్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. బావ, బామ్మర్దులైన వీరిద్దరూ గత కొంతకాలం నుంచి క్లీనర్, డ్రైవర్‌గా లారీ ద్వారా సరుకు రవాణా చేస్తుండేవారు. కందుకూరు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బందేలికి సుబాబుల్ లోడ్‌తో లారీ బయల్దేరింది. అయితే పత్తికొండ-రాతన గ్రామాల మధ్య మలుపు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో క్లీనర్ బుడ్డబాషా లారీ కింద పడి దుర్మరణం పాలయ్యాడు. డ్రైవర్ షేక్ నాగూర్‌వలి తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



లారీ కిందపడి ఛిద్రమైన క్లీనర్ బుడ్డ బాషా మృతదేహం